సాక్షి
చిత్తూరు

శనివారం ၊ 11 ၊ జనవరి ၊ 2025

ఇల వైకుంఠపురంలో..



స్వర్ణరథంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప (ఇన్‌సెట్) అంతరాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ



తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం నేత్రపర్వంగా ప్రారంభమైంది. శుక్రవారం తెల్లవారుజామున అభిషేకం తర్వాత శ్రీవారి దర్శనానికి అనుమతి లభించింది. ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి ఆ ఏడు కొండల వాడిని తనివితీరా దర్శించి భక్తులు పునీతులయ్యారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ పరిసరాలతోపాటు అంతరాలయంలో ప్రత్యేక ఫల, పుష్పాలంకరణలు చేపట్టారు. విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. ఉభయదేవేరులతో కలిసి మలయప్ప స్వామి స్వర్ణరథాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. – తిరుమల



ప్రత్యేక ఫల, పుష్పాలంకరణలో రంగనాథస్వామి ఆలయం

న్యూస్‌రీల్

వస్తువుల సరఫరాకు కొటేషన్ల ఆహ్వానం

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అవసరమైన వస్తువులను సరఫరా చేసేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి కొట్టేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో ప్రసిద్ధి చెందిన మొగిలిలో స్వయంభు మొగిలీశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 8వ తేదీ వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దేవాలయానికి సున్నం, రంగులు వేయడం, 11 రోజుల పాటు ఆలయానికి విద్యుద్దీపాలంకరణ, భక్తుల సౌకర్యార్థం పందిళ్లు ఏర్పాటు, మంగళవాయిద్యాలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవాలకు పుష్పాలంకరణ, ప్రభల అలంకరణకు పూలు, దండలు సరఫరా చేయడానికి తక్కువ ధరతో కొటేషన్లను సమర్పించాలని కోరారు. కొటేషన్లను ఈ నెల 17వ తేదీలోపు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

కోడిపందేలు చట్టరీత్యానేరం

- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : కోడి పందేలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యానేరమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కోడి పందేలు ఎవరైనా నిర్వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పందేల్లో పాల్గొన్నా కూడా చర్యలుంటాయన్నారు. ఎవరైనా చట్టాలను ఉల్లంఘిస్తే సంబంధిత వ్యక్తులపై సెక్షన్ 10 – ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974, సెక్షన్ 34 – జంతు హింస నివారణ చట్టం, 1960 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశు సంవర్ధక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీన జిల్లా కేంద్రంలో అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆ సంఘం నాయకులు ఈ కార్యక్రమానికి విచ్చేయాలని కలెక్టర్ కోరారు.

వడ్డెర సంఘం ఆధ్వర్యంలో..



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

జిల్లా కేంద్రంలో ఈ నెల 11వ తేదీన వడ్డే ఓబన్న జయంతి నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు రవీంద్రబాబు తెలిపారు. ఆ సంఘ నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లో పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు చిత్తూరు గాంధీ విగ్రహం నుంచి నాగయ్య కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. వడ్డెర సంఘం నాయకులు, ప్రజలు కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు గుర్రప్ప, పూతలపట్టు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్, యూత్ అధ్యక్షులు హరిబాబు, మహిళా అధ్యక్షురాలు కుసుమ, కార్యదర్శి సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

13న గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీన రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన భోగి పండుగ (ప్రభుత్వ సెలవు) రోజు కావడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా వాసులు గమనించాలని కోరారు.

మూగ రోదన.. తీరని వేదన



చిన్నపాటి జబ్బు చేసినా మనం ఆస్పత్రులకు ఉరుకులు, పరుగులు తీస్తాం. మూగ జీవాల పరిస్థితి వేరు. తమకు ఏమి ఇబ్బందో చెప్పలేవు.. వీటి వ్యాధుల నివారణకు ప్రభుత్వ పశు వైద్యశాలలు తప్ప..గ్రామాల్లో ప్రత్యేక ఆస్పత్రులు లేవు. ఉన్న ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు, సిబ్బంది లేరు.. ఉన్నా సమయపాలన పాటించకుండా మధ్యాహ్నానికే మూత వేస్తున్నారు. ఫలితంగా పశువులు వ్యాధుల బారిన పడి పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో కుంటుపడుతున్న పశువైద్యం

- సమయానికి తెరవని పశువైద్యశాలలు
- అందుబాటులో లేని పశు వైద్యబృందం
- పశువులకు సీజనల్ వ్యాధుల ముప్పు
- పట్టించుకోని పశువైద్యశాఖ అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో పశువైద్యం కుంటుపడుతోంది. ప్రధానంగా పశు వైద్యశాలలు సమయపాలన లేక గాడి తప్పుతున్నాయి. వైద్యబృందం అందుబాటులేక పశు వైద్యం కడుదైన్యంగా మారుతోంది. దీనికితోడు పశు సంచార వైద్య వాహనానికి బ్రేకులు పడ్డాయి. ఆస్పత్రులు, రైతు భరోసా కేంద్రాలను మందుల కొరత వేధిస్తోంది. తద్వారా మూగ జీవాలకు సీజన్ వ్యాధుల బారిన పడుతున్నాయి. పశువేదనను పశువైద్యాధికారులు పట్టించుకోకపోవడంతో పాడి రైతాంగం కంటతడి పెడుతోంది.

పశు సంపదే ఆధారం

జిల్లాలో అధిక శాతం కుటుంబాలు పశుసంపద ఆధారంగా జీవనం సాగిస్తున్నాయి. ప్రధానంగా జిల్లాలో చాలా కుటుంబాలకు పాడి పరిశ్రమే బువ్వ పెడుతోంది. అయితే ఈ పశు సంపద రక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం పశువైద్యంపై చిన్నచూపు చూస్తోంది. దీంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందుల కొరత

పశు వైద్యశాలల్లో మందుల కొరత వేధిస్తోంది. ఒకటి ఉంటే రెండు లేవని అక్కడి సిబ్బంది వాపోతున్నారు. ఈ అరకొర మందులతో ఎలా వైద్యం చేయాలని ప్రశ్నిస్తున్నారు. బేసిక్ మందులు కూడా లేవనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. గాయం అయితే వైద్యం చేయడానికి కాటన్, టించర్ సైతం లేదని సిబ్బంది చెబుతున్నారు. ప్రధానంగా వైద్యశాల ఆవరణలో నీటి వసతి కరువవతోంది. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు పూర్తిస్థాయిలో లేవు. నట్టల నివారణ మందులు, పిడుదల మందులు, పారుడురోగ నివారణ మందులు, కడుపు ఉబ్బరం మందులు, గర్భ సంబంధిత మందులు, చర్మరోగ మందులు తదితరాలు లేవని వైద్యులు చెబుతున్నారు. అలాగే చికిత్స అందించేందుకు కావాల్సిన పరికరాలైన థర్మామీటర్, గ్లౌజులు, షీతులు, థంబ్‌ఫోర్‌సెప్స్, కత్తెర వంటివి సైతం లేదని అంటున్నారు.

ప్రైవేటు వ్యక్తుల చేతిలో పశువైద్యం

పలు చోట్ల ప్రభుత్వ వైద్య బృందం అందుబాటులో లేని కారణంగా పాడి రైతులకు పశువైద్యం కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోంది. గోపాలమిత్రాలుగా పనిచేస్తున్న కొంత మంది వ్యక్తులు ప్రైవేటు వైద్యులుగా చలామణి అవుతున్నారు. ఊరూరా తిరుగుతూ వారి సేవలను విస్తరించుకుంటున్నారు. అలాగే కొంత మంది వ్యక్తులు ఎలాంటి విద్యార్హత లేకుండా పశువైద్యం చేస్తున్నారు. ఇష్టానుసారంగా యాంటీబయోటిక్ మందులు వాడుతున్నారు. ఇలాంటి వైద్యంతో పశు సంపద పూర్తిగా దెబ్బతింటోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

గతంలో పశువైద్యానికి భరోసా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పశు వైద్యానికి భరోసా కల్పించింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఈ కేంద్రాల ద్వారా పశు వైద్యసేవలకు జీవం పోసింది. ప్రతి సంవత్సరం పశువులను సర్వే చేసింది. వాటికి సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకునేది. జబ్బు పడితే పశు వైద్య సహాయకులు పాడి రైతుల ఇంటా వాలిపోయేవారు. క్రమం తప్పకుండా ఆరోగ్య వివరాలను తెలుసుకుంటూ పశువులను పరీక్షించేవారు. పాడి రైతులకు అండగా పశు బీమా ఇచ్చేది. మృత్యువాత పడిన పశువులను పోస్టుమార్టం చేసి, రైతులకు బీమా నగదు అందేలా చేసేవారు. పశు సంచార వైద్య వాహనం ఏర్పాటు చేసి ఇంటి వద్దకే పశు వైద్యసేవలు అందించింది. ఇందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి రైతులే నేరుగా సేవలు పొందేలా చేసింది. ఈ సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఇప్పటికైనా పశు వైద్యాధికారులు స్పందించి దారి తప్పిన పశు సేవలను గాడిలోపెట్టాలని రైతులు వేడుకుంటున్నారు.



సంచార పశు వైద్యశాల వాహనం

తెరిస్తే ఒట్టు

ప్రతి చోట పశుసంపద వృద్ధి చెందుతోంది. అయితే దీనికి తగ్గట్టు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ప్రధానంగా చాలా ఆస్పత్రుల్లో పశువైద్యులు ఉండడం లేదు. కొందరు పశువైద్యులు సమావేశాల పేరుతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సొంత పనులకు పరిమితమవుతున్నారు. డెప్యుటేషన్ల పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సిబ్బంది లేక కొన్ని చోట్ల, కొన్ని చోట్ల ఉన్నా విధులకు రాక వైద్యశాలలు తలుపులు తెరుచుకోవడం లేదు. వచ్చిన మధ్యాహ్నానికి తలుపులు వేసి వెళ్లిపోతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పశు వైద్యశాలలు పనిచేయాల్సి ఉంది. ఈ రకంగా ఒకటి, రెండు మాత్రమే పనిచేస్తూ, మిగిలినవి మూత పడుతున్నాయి. దీంతో పాడి రైతులు పశు వైద్యం కోసం అవస్థలు పడుతున్నారు. చాలా చోట్ల రైతు భరోసా కేంద్రాల్లోనూ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. సమయానికి పాడి పశువులకు వైద్యం అందించాలని వేడుకున్నా సిబ్బంది తమను చిన్నచూపు చూస్తున్నారని పాడిరైతులు వాపోతున్నారు. రైతు భరోసా కేంద్రంలోని పశు వైద్య సహాయకులు సర్వేలకు పరిమితం కావడంతో పశువైద్యం పూర్తిగా గాలిలో దీపంలా మారిందని చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో ప్రైవేటు వైద్యమే దిక్కుగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

జిల్లా పశువుల ఆస్పత్రి	1
ఏరియా పశు వైద్యశాలలు	14
వెటర్నరీ డిస్పెన్సరీ వైద్యశాలలు	68
రూరల్ లైఫ్ స్టాక్ యూనిట్లు	75
రైతు భరోసా కేంద్రాలు	297
పాడి ఆవులు	4,67,507
గేదెలు	1,036
మేకలు	13,80,063
గొర్రెలు	4,38,362
పందులు	359
కుక్కలు, కోళ్లు	5,08,808

ఎవరూ లేరు



పాడి ఆవుకు బొబ్బర్ల రోగం వచ్చింది. ఈ రోగానికి మందు తీసుకెళ్లేందుకు ఆస్పత్రికి వచ్చాను. తాళం వేసి ఉన్నారు. అర్ధగంట పాటు వేచి చూశా. ఎవరు రాకపోవడంతో తిరిగి ఇంటికి వెళుతున్నా. పనివేళల్లో ఆస్పత్రిల్లో డాక్టర్లు ఉంటే బాగుంటుంది. ఆవులు ఇప్పుడు దండిగా ఉన్నాయి. దానికి తగ్గట్టు వైద్య సేవలు ఉండాలని అనుకుంటాం.

– జయచంద్రారెడ్డి, మంగుంట, శ్రీరంగరాజుపురం

పిడుదల మందులు కూడా లేవు



ఆవులకు సీజనల్ జబ్బులు వస్తుంటాయి. ఏ రోగం వచ్చిన దగ్గరుండే పశువుల ఆస్పత్రికి వెళుతున్నాం. కానీ అక్కడ ఏ జబ్బుకైనా మందులు లేవంటున్నా రు. పిడుదల నివారణకు మందులు కూడా లేవటా. అంతా బయట తెచ్చుకొని పేపర్లో రాయిస్తున్నారు. ఇప్పుడు చాలామంది మధ్యతరగతి కుటుంబాలు ఈ పాడి పారిశ్రమ మీదే ఆధారపడి బతుకుతున్నాం. అధికారులు స్పందించి డాక్టర్లు, మందులకు ఢోకా లేకుండా చూడాలి.

– సుధాకర్, పాలసముద్రం

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకపూజలు



బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి రాహుకాల అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో సంప్రదాయరీతిలో అర్చనలు, అభిషేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

గజాసురుడిపై వరసిద్ధుడు



గజాసుర వాహనంపై కొలువుదీరిన వరసిద్ధి వినాయక స్వామివారు -కాణిపాకం

అధికార పార్టీ ఏజెంట్‌గా ఎంపీడీఓ

- మండల సమావేశం బహిష్కరించి నిరసన వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు
- అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నారని ఎంపీడీఓపై ఆగ్రహం
- సెలవు పెట్టి సమావేశానికి రాని రెగ్యులర్ ఎంపీడీఓ
- నేలపై బైఠాయించి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుల ఆందోళన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మండల ప్రజాప్రతినిధులు

పలమనేరు: పలమనేరు మండల సర్వసభ్య సమావేశాన్ని ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. మండలంలో అభివృద్ధి పనులు చేయనీకుండా అధికార పార్టీకి ఏజెంట్ మారిన ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేలపై బైఠాయించి ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ మల్లిక ఆందోళన చేశారు. అభివృద్ధి పనులను మంజూరు చేసే వరకూ మండల సమావేశం నిర్వహించేది లేదని స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రోజా అధ్యక్షతన మండల సమావేశం మొదలైంది. రెగ్యులర్ ఎంపీడీఓ ఖాదర్ బాషా సెలవు పెట్టడడంతో ఏఓ వినోద ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వ్యవహరించారు. కాసేపటికే మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీఓపై ధ్వజమెత్తారు. గత సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ద్వారా తీర్మానించిన పలు పనులను రెగ్యులర్ ఎంపీడీఓ ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. 15 ఆర్థిక సంఘానికి చెందిన నిధులను ప్రజలకు ఖర్చు చేయకుండా ఎంపీడీఓ ఖాదర్‌బాషా ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు సమావేశ మందిరంలోనే నేలపై కూర్చుని ఆందోళన సైతం చేశారు. ప్రజాప్రతినిధులు మండల సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించి వినతి పత్రాన్ని అధికారులకు ఇచ్చారు. ఆపై కార్యాలయం వెలుపల నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీ నాయుడు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు మండల సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు గతంలో ఎంపీపీ ప్రతిపాదించిన పనులకు జెడ్పీ, మండల గ్రాంట్ నుంచి రూ.32లక్షలు మంజూరైనా ఆ పనులకు ఎంపీడీవో ఖాదర్‌బాషా కావాలనే ఆమోదం తెలపలేదని మండిపడ్డారు. ఈ పనుల విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను కలిసి సీఈవో ద్వారా ఆదేశాలు ఇప్పించినా ఎంపీడీఓ బేఖాతర్ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ తీరును నిరసిస్తూ నేలపై కూర్చొని ఆందోళన చేస్తున్న ఎంపీపీ , జెడ్పీటీసీ సభ్యురాలు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య

చిత్తూరు కార్పొరేషన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయవద్దని ఏఐటీయూసీ జిల్లా నాయకులు తెలిపారు. శుక్రవారం చిత్తూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ మాట్లాడారు. అధికారంలో వచ్చాక కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం మరిచిపోయిందని విమర్శించారు. కొత్త ఉద్యోగాలను కల్పించకుండా ఉన్నవారిని తీసి వేసే ప్రయత్నం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందన్నారు. కార్మిక చట్టాలు 44ను కుదించి 4 కోడ్‌లుగా మార్చిందన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ఉన్న స్కీము కార్మికులు జాతీయస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేసిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆటో, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. దేశంలో ఏర్పడిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సంక్షేమ బోర్డు నిధులను దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. నాయకులు దాసరి చంద్ర, రమాదేవి, అనుబంధ సంఘాల నాయకులు మణి,విజయ్ కుమార్, క్రిష్ణ , వెంకటేష్, శంకర్, దామోదరం, వినాయక, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓపై చర్యలకు ఫిర్యాదు



సీఈఓ రవికుమార్‌నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చిత్తూరు కార్పొరేషన్: విధి నిర్వహణలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న గంగవరం ఎంపీడీఓ సురేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడికి ఫిర్యాదు అందింది. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో సమస్యను లిఖితపూర్వకంగా ఆ మండల ప్రజాప్రతినిధులు తెలియజేశారు. ప్రధానంగా ప్రజాప్రతినిధులను చులకనగా చూస్తున్నారన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు, జెడ్పీ నిధులతో చేయాల్సిన పనులను చేయడం లేదన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానాలు చేసిన పనులకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. అకారణంగా పంచాయతీ కార్యదర్శులందరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతున్నప్పుడు హఠాత్తుగా కోరం లేదని ప్రకటించడాన్ని ఖండించారు. ఆయన పనితీరుతో మండలంలో అభివృద్ధి జరగడం లేదన్నారు. ఆయనపై విచారణ కమిటీ వేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎంపీపీ వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్‌లు గిరిరాజరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నాగేంద్ర, నాయకుడు చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీటీఏఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా చెంగల్‌రాయుడు



ఎన్నికైన ఏపీటీఏఎస్ఏ నూతన కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీటీఏఎస్ఏ) జిల్లా అధ్యక్షుడిగా (ఎస్టీఓ) చెంగల్‌రాయుడు ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆ సంఘం ఎన్నికలు నిర్వహించారు. విజయవాడకు చెందిన శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా కేఎన్. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, గుణశేఖర్, సుకన్య, కార్యదర్శిగా పయణి, కార్యనిర్వాహక కార్యదర్శిగా చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, మహమ్మద్ తరీఫ్, జ్ఞానసుందరి, వెంకటాచలపతి ఎన్నికయ్యారు. అనంతరం నూతన సభ్యులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ట్రెజరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. నూతన కమిటీకి పలువురు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

విజయం విద్యార్థికి ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డుతో ఎంబీఏ విద్యార్థి హరీష్.

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని విజయం ఎంబీఏ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి హరీష్‌బాబు ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లాలోని ఐరాల మండలం 45 కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ బాలాజీ కుమారుడు హరీష్‌బాబు ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డు పొంది, జిల్లాకు గర్వ కారణంగా నిలిచారు. విద్యారంగంలో, సామాజిక సేవలో విశిష్టమైన సేవలు అందిస్తున్న హరీష్‌ను స్టార్టప్ శిక్ష ఇండియా ఫౌండేషన్ గుర్తించింది. ఇందుకు గాను ఆ విద్యార్థికి ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఎక్సెలెన్సు అవార్డును ఇటీవల ఆ ఫౌండేషన్ సభ్యులు ప్రదానం చేశారు. ఆ విద్యార్థిని విజయం చైర్మన్ తేజోమూర్తి, పలువురు అభినందించారు.

ఆర్‌అండ్‌బీలో అధికారిపై ఫిర్యాదు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఉన్నతాధికారిపై ఓ మహిళా ఏఈ రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విధి నిర్వహణలో తక్కువ చేసి మాట్లాడడం, చులకనగా చూడడం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వేధిస్తున్నారని అందులో పేర్కొంది. పనిచేయకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు ఏఈ సమస్యలు ఏకరవు పెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు వివరాలు సేకరించడం ప్రారంభించారు.

అక్రమాలకు హైవే పలమనేరు జాతీయ రహదారి.. ఆ మార్గంలో పలు వస్తువుల అక్రమ రవాణా నిత్యం యథేచ్ఛగా సాగుతుంది. అక్రమ వాహనాలు రైట్ రైట్ అన్నట్టు తిరుగుతాయి. ఇదంతా తెలిసినా రవాణా శాఖాధికారులు వాటి వైపు కన్నెత్తి కూడా చూడరు. అయితే చిరు వ్యాపారులు, రైతులను మాత్రం వేధింపులకు గురి చేసి, జరిమానాలు విధించడం, లేదా మామూళ్లు తీసుకుని వదిలేయడం చేస్తున్నారు. ఫలితంగా బడుగు జీవులు బాధపడుతున్నారు.





పలమనేరు మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తరలిస్తున్న వాహనాలు

- అక్రమ వాహనాలపై కన్నెత్తి చూడని ఆర్టీఏ
- అన్నదాతలు, చిరువ్యాపారులపై కొరడా
- వింత పోకడలో పలమనేరు రవాణాశాఖ

అక్రమార్కులకు రైట్ రైట్.. బడుగులే టార్గెట్

పలమనేరు: తిమింగలాలను వదలి.. చిరుచేపలను వేటాడినట్టుంది పలమనేరు రవాణాశాఖాధికారుల పరిస్థితి. పలమనేరు హైవే మీదుగా నిత్యం నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్, కలప, బియ్యం, పప్పు దినుసుల స్మగ్లింగ్ జోరుగా సాగుతోంది. పర్మిట్ లేని కర్ణాటక బస్సులు, ప్రైవేటు ట్రావెల్ వాహనాలు అధిక సంఖ్యలో తిరుగుతున్నాయి. అధిక బరువుతో వెళ్లే వాహనాలూ అధికంగానే రాకపోకలు సాగిస్తున్నాయి. రవాణాశాఖాధికారులు వీటిని సీజ్ చేసి జరిమానాలు విధించాల్సి ఉన్నా వాటి వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అయితే స్థానికంగా రైతులు తాము పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకొచ్చే వాహనాలు, స్థానిక మార్కెట్ నుంచి తమిళనాడుకు వెళ్లే టాటా ఏస్‌లు, లగేజీ ఆటోలు, చిన్న టెంపోలను పట్టుకోవడంపై అధిక శ్రద్ధ చూపుతున్నారు. వారితో బేరసారాలు ఆడుతున్నారు. కుదరకుంటే ఆ వాహనాన్ని కాటా వద్దకు తీసుకెళ్లి, బరువు తూకం చూసి, అధిక లోడ్ ఉందంటూ జరిమానాలు కట్టించుకోవడం పరిపాటిగా మారిపోయింది. అసలే కూరగాయలకు ధర లేక ఇక్కట్లు పడుతున్న రైతులు, చిరు వ్యాపారులకు స్థానిక రవాణాశాఖలో పనిచేస్తోన్న ఓ అధికారి చుక్కలు చూపిస్తున్నారు.

చిన్న వాహనాలే టార్గెట్

పలమనేరు కూరగాయల మార్కెట్‌కు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి రైతులు పండించిన టమాట, క్యాబేజీ, అరటి, బొప్పాయి తదితర పంటలను అద్దె వాహనాల్లో తరలిస్తున్నారు. అలాగే తమిళనాడు నుంచి చిరు వ్యాపారులు చిన్న వాహనాల్లో స్వయంగా ఇక్కడికి వచ్చి, మార్కెట్‌లో కావాల్సిన కూరగాయలను కొనుగోలు చేసుకుని, గ్రామాల్లో విక్రయించుకుంటున్నారు. వీటిపై కన్నేసిన ఇక్కడి సహాయ ఎంవీఐ ఓ ఆల్టో కారులో రావడం, పట్టణ సమీపంలోని నక్కపల్లి నుంచి క్యాటిల్ ఫామ్, నాగమంగళం, ఇటు గంటావూరు, అటు గుడియాత్తం రోడ్డులో ఇలాంటి రైతులు, వ్యాపారుల వాహనాలను ఆపి, వారితో భేరాలు ఆడుతున్నారు. బేరం కుదిరితే సరి, లేదంటే జరిమానాలు భారీగా వేసేస్తున్నట్టు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీ వాహనాలను వదిలి..

ఇదే మార్గంలో కర్ణాటక ఆర్టీసీ బస్సులు పదుల సంఖ్యలో ఎలాంటి పర్మిట్లు లేకుండా తిరుపతి, తిరువణ్ణామలై, మేలమళత్తూర్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక ప్రైవేటు ట్రావెల్స్ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రయాణికులతో సుదూర ప్రాంతాలకు వెళుతున్నాయి. మదనపల్లి వైపు నుంచి తమిళనాడుకు ఓవర్ లోడ్‌తో గ్రానైట్ లారీలో వెళుతుంటాయి. వీటిపై చర్యలు తీసుకోకుండా రోజూ రైతుల కూరగాయలు తీసుకొచ్చే చిన్న వాహనాలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ విషయమై స్థానిక ఎంవీఐ మధుసూదన్‌ను వివరణ కోరగా నిబంధనల మేరకు జరిమానాలు విధిస్తున్నామని, ప్రత్యేకంగా రైతులను టార్గెట్ చేసే విషయంపై విచారిస్తామని చెప్పారు.

ఎట్టా బతికేది?



టాటా ఏస్‌లో రైతులు పండించిన పంటలను ఇక్కడి మార్కెట్‌కు తీసుకొస్తుంటా. ఇటీవల మా వాహనాలను తరచూ పట్టుకోవడం, బరువు ఎక్కువగా ఉందని కాటా వేయించడం, దానికి భారీగా జరిమానా విధించడం చేస్తున్నారు. అందుకే కూరగాయలు తోలేందుకు వెళ్లడం మానేశా. పెద్ద బండ్లను వదిలేసి, మాలాంటి పేదలపై పడితే ఎట్టా బతికేది.

–మొగిలి, టాటాఏస్ డ్రైవర్, పలమనేరు

ఫైన్ కట్టాల్సిందేనంటున్నారు!



ఇటీవల క్యాబేజీని పొలం వద్ద నుంచి పలమనేరు మార్కెట్‌కు ఐదు కిలోమీటర్ల దూరం మాత్రమే టాటాఏస్‌లో తీసుకొస్తుంటే ఆల్టో కారులోని సారు బండి ఆపి, రూ. 5 వేలు కట్టించుకున్నారు. ఇదేంది సార్ మేము రైతులం.. ఇలా అయితే ఎలా మార్కెట్‌కు సరుకు తీసుకెళ్లేది అని అడిగాం. అసలే ధరలేక మిగిలేది అంతంత మాత్రంగానే ఉంది. దాన్ని మీకు కట్టేస్తే మా పరిస్థితి ఏంటని అడిగాం. అవంతా కాదు ఫైన్ కట్టాల్సిందేనని వసూలు చేశారు.

–హరి, రామాపురం, రైతు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎన్జీఓ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు కలెక్టరేట్‌లో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ఉద్యోగుల సమస్యలను కలెక్టర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఎన్జీవో సంఘం కార్యదర్శి రఘు, సిటీ అధ్యక్షులు భాను, సభ్యులు మురుగేషన్, బాల సుబ్రహ్మణ్యం, ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచొద్దు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ చార్జీలను పెంచవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు డిమాండ్ చేశారు. ఏపీఈఆర్సీ శనివారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై మాట్లాడారు. ట్రూఅప్ చార్జీలను వినియోగదారులపై పడకుండా ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రతి నెలా సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై రూ.కోట్లు భారం వేయడం దారుణమని చెప్పారు.

వాడకం తక్కువగా ఉన్నా బిల్లులు మాత్రం ఎక్కువగా వస్తున్నాయని ఆయన చెప్పారు. టైం ఆఫ్ డే విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఒక రోజులో పీక్ అవర్స్ 8 గంటలు, ఆఫ్ పీక్ అవర్స్ 11 గంటలు, నార్మల్ అవర్స్ 5 గంటల చొప్పున విభజించాలని ప్రతిపాదన పెట్టడం మానుకోవాలని సూచించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకత వస్తోందన్నారు. తూతూమంత్రంగా ప్రజాభిప్రాయం సేకరించి చార్జీలను పెంచాలని చూడడం అన్యాయమన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో పలువురి నియామకం

చిత్తూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లా కమిటీలో పలువురికి పలు హోదాల్లో నియామకం కల్పిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్(చిత్తూరు), కె కోదండరెడ్డి (కుప్పం), శాంతిసాగర్‌రెడ్డి (పూతలపట్టు), గురవరెడ్డి (గంగాధరనెల్లూరు), బీడీ భాస్కర్ (నగరి), సాయిక్ ముజమ్మిల్ (పలమనేరు), దామోదరరాజు (పుంగనూరు), ముస్తూరు రవి (తిరుపతి), ధనుంజయ్యరెడ్డి(సత్యవేడు) నియమితులయ్యారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శులుగా వేలకచర్ల గోపాల్‌రెడ్డి(తిరుపతి), టీజీ మహేశ్వర్ నాయుడు (చిత్తూరు), ఎస్‌కే మురవత్ భాషా(పుంగనూరు), దయాసాగర్‌రెడ్డి (గంగాధరనెల్లూరు), టి. అనిల్‌కుమార్ (నగరి) నియమితులయ్యారు. అలాగే పార్టీ జిల్లా కోశాధికారిగా తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు(తిరుపతి), కార్యనిర్వాహక కార్యదర్శిగా కరేటే శ్రీను (తిరుపతి), బత్తిన బాబు (తిరుపతి), ఎస్ఎస్ రజనీకాంత్ (చిత్తూరు), జె దిలీప్‌కుమార్ (చిత్తూరు), సుబ్బన్న యాదవ్ (పుంగనూరు), ఉదయ్‌కుమార్‌రెడ్డి (పుంగనూరు), లక్ష్మణ్‌రెడ్డి (పలమనేరు), రాధాకృష్ణ(పలమనేరు), ఎం వెంకటేష్ (కుప్పం), సాకత్ అల్లీ(కుప్పం), గోవిందస్వామి(పూతలపట్టు), జయచంద్రారెడ్డి(పూతలపట్టు), ఆర్ బాలాజీ(గంగాధరనెల్లూరు), రామయ్య(గంగాధరనెల్లూరు), లీలారామన్(నగరి), చిరంజీవి(నగరి) నియమితులయ్యారు. క్రియాశీలక కార్యదర్శులుగా రామక్రిష్టారెడ్డి (పుంగనూరు), వెంకటరమణ(పుంగనూరు), శంకరప్ప(పలమనేరు), బాబు(పలమనేరు), టి కుమార్ (చిత్తూరు), టి కృష్ణమూర్తిరెడ్డి(చిత్తూరు), ఆర్ చలపతి (కుప్పం), మురుగేష్(కుప్పం), జయచంద్రారెడ్డి(పూతలపట్టు), కిషోర్‌రెడ్డి (పూతలపట్టు), కుప్పయ్య (గంగాధరనెల్లూరు), విజయ్ కుమార్(గంగాధరనెల్లూరు), టీసీ మురగయ్య(నగరి), మాధవ వర్మ(నగరి), సి జగదీష్ రెడ్డి(సత్యవేడు), లాల్‌బాబ్ యాదవ్(సత్యవేడు), జె గోపాల్‌రెడ్డి(సత్యవేడు), రాకేష్ కిరణ్(సత్యవేడు), దళనం ప్రసాద్‌రాజు(తిరుపతి), ఎ కోటి (తిరుపతి) నియమితులయ్యారు. అధికార ప్రతినిధులుగా రాజశేఖర్‌రెడ్డి (పుంగనూరు), రంగనాథం(పలమనేరు), గాయత్రీదేవి(చిత్తూరు), భాస్కర్ నాయక్ (కుప్పం), కోదండన్(గంగాధరనెల్లూరు), నల్లప్ప రెడ్డి సుధాకర్ రెడ్డి(పూతలపట్టు), చెంచు రమణరాజు(నగరి), వెంకటయ్య అలియాస్ చిన్న(సత్యవేడు),పసుపులేటి సురేష్ రాయల్(తిరుపతి), యాచం వాసుదేవయాదవ్(తిరుపతి)లను నియమించినట్లు పార్టీ కార్యాలయం వెల్లడించింది.

ప్రభుత్వ భూమి కోసం ఘర్షణ

– వ్యక్తికి కత్తిపోట్లు



కత్తిపోట్లుకు గురైన మోపూరి సుబ్రమణ్యం



పత్తెమ్మగారిపల్లె వద్ద ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

పుంగనూరు: గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న ఓ కుటుంబంతో ఆ భూమి కోసం ఘర్షణ పడిన గ్రామస్తుడిని వారు కత్తితో పొడిచిన సంఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని పత్తెమ్మగారిపల్లెకు చెందిన ప్రభుత్వ భూమిని శ్రీనివాసులు, జగదీష్, శివకుమార్ కుటుంబ సభ్యులు సాగు చేసుకుంటున్నారు. కాగా ఈనెల 2వ తేదీన జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు ప్రభుత్వ భూమిని గ్రామానికి కేటాయించాలని, దీని దురాక్రమణను నిరోధించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ సిబ్బందితో కలసి సర్వే చేశారు. సర్వేలో ప్రభుత్వ భూమిగా నిర్ధారించి, గ్రామస్తులకు కేటాయించారు. దీనిపై ఆగ్రహించిన శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు నలుగురు అదే గ్రామానికి చెందిన మోపూరి సుబ్రమణ్యంను కత్తితో పొడిచారు. దీంతో సుబ్రమణ్యం పరిస్థితి విషమంగా మారింది. గ్రామస్తులు వెంటనే అతనిని అంబులెన్స్‌లో కోలారు ఆస్పత్రికి తరలించారు. సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, నిందితులను అదుపులోనికి తీసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


దళితవాడకు దారి మూసివేత



దళితవాడకు దారిలేకుండా అడ్డంగా స్తంభాలు నాటి రాకపోకలను అడ్డుకుంటున్న అగ్రకులస్తులు

పెనుమూరు(కార్వేటినగరం): అగ్రవర్ణాల వారు పెనుమూరు మండలంలోని పులికల్లు పంచాయతీ చెర్లోపల్లె దళితవాడకు వెళ్లే దారికి అడ్డంగా రాతి స్తంభాలు నాటి మూసివేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. చెర్లోపల్లి దళితవాడలో సుమారు 18 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆ గ్రామానికి 25 ఏళ్లుగా రోడ్డు సౌకర్యం ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.19 లక్షల వ్యయంతో మెటల్ రోడ్డు నిర్మించారు. అయితే చెర్లోపల్లి దళితవాడకు చెందిన దళితులు అగ్రవర్ణాల వారికి అనుకూలంగా లేరని, అప్పుడప్పుడు దళితులకు దారి లేకుండా అడ్డుకుంటూ వచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు అగ్రకులస్తులు గత శనివారం దారికి అడ్డంగా ట్రాక్టర్ ట్రాలీ అడ్డంగా పెట్టి దళితులకు దారి లేదని హెచ్చరించారు. దీంతో వారు మండల తహసీల్దార్‌కు తమ గోడు వినిపించారు. తహసీల్దార్ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను తొలగించి, దారి సౌకర్యం కల్పించడానికి అగ్రవర్ణాల వారితో చర్చించి, ఒప్పించారు. అయితే అగ్రకుస్తులు శుక్రవారం రోడ్డుపై ఏకంగా రాతి స్తంభాలు నాటి, దళితవాడకు దారి మూసి వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి చెర్లోపల్లి దళితవాడకు దారి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

ఇద్దరికి జీవిత ఖైదు



పోలీసుల అదుపులో నిందితులు

చిత్తూరు అర్బన్: వివాహేతర సంబంధం మాయలో పడి, కట్టుకున్న భర్తను చంపిన ఘటనలో లక్ష్మి (40) అనే మహిళతోపాటు, బాబూలాల్ (34) అనే వ్యక్తికి జీవితఖైదు విధిస్తూ చిత్తూరులోని ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం జడ్జి సుంకర శ్రీదేవి శుక్రవారం తీర్పు ఇచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులికల్లు రవీంద్రనాథ్‌రెడ్డి కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన శ్రీనివాసులు లారీ నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఇతనికి భార్య లక్ష్మి, ఓ కుమారుడు ఉన్నాడు. రొంపిచెర్ల మండలం మొరవపల్లెకు చెందిన బాబూలాల్ తమ్ముడు లారీకి క్లీనర్‌గా పనిచేయడానికి వచ్చేవాడు. ఇదే అదునుగా తరచూ చిత్తూరులోని శ్రీనివాసులు ఇంటికి బాబూలాల్ వస్తూ పోతూ లక్ష్మితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో 2017 సెప్టెంబర్ 11వ తేదీన బాబూలాల్, లక్ష్మి ఇద్దరూ చిత్తూరులోని అంబేడ్కర్ నగర్‌లో ఇంట్లో ఉండగా శ్రీనివాసులు వచ్చి చూసి, వాగ్వాదానికి దిగాడు. విషయం చుట్టుపక్కల వాళ్లకు తెలిసిపోతుందని భావించిన లక్ష్మి, బాబూలాల్ ఇద్దరూ ఇంట్లో ఉన్న ఇనుపరాడ్‌తో శ్రీనివాసులు తలపై కొట్టి హత్య చేశారు. లక్ష్మి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులిద్దరినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువుకావడంతో నిందితులకు జీవితఖైదు, ఒక్కొక్కరికీ రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆవు గడ్డిమేసిందని కొట్టాడు!

పుంగనూరు: మండలంలోని కొండమదొడ్డి గ్రామంలో ఓ వ్యక్తికి చెందిన ఆవు, మరో వ్యక్తి తన పొలంలో గడ్డిమేసిందని, ఘర్షణ పడి కొట్టిన సంఘటన శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన జ్ఞానేంద్రరెడ్డి, కుమ్మరగుంట క్రాస్ వద్ద తన భూమిలో అదే గ్రామానికి చెందిన గంగప్ప ఆవులు గడ్డిమేస్తుండడంతో గమనించి అడ్డుకున్నాడు. దీనిపై ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ సమయంలో గంగప్ప కర్రతో జ్ఞానేంద్రరెడ్డిపై దాడి చేయడంతో అతడు గాయపడ్డాడు. స్థానికులు గమనించి జ్ఞానేంద్రరెడ్డిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పొలాలపై ఏనుగుల దాడి



ఏనుగులు ధ్వంసం చేసిన టమాట పంట

బంగారుపాళెం: మండలంలోని అటవీ సరిహద్దు గ్రామమైన కాల్వ మొగిలప్పకండ్రిగ(కేఎం కండిగ)లో గురువారం రాత్రి ఏనుగులు పంటలపై దాడి చేసి తీవ్రనష్టం కలిగించాయని బాధిత రైతులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతు శంకరయ్యకు చెందిన టమాట పంటను తొక్కేశాయి. గురుమూర్తి, దేవేంద్రకు చెందిన మామిడితోటలో కొమ్మలను విరిచేశాయి. మరోరైతు నాగభూషణానికి చెందిన కొబ్బరి చెట్లను విరిచేశాయి. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు పొలాలపైకి వచ్చాయని తెలిపారు. శుక్రవారం వీఆర్వో శివ, ఫారెస్టు సిబ్బంది దెబ్బతిన్న రైతు పంటలను పరిశీలించారు. ఏగులదాడిలో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. మండలంలోని అటవీ సరిహద్దు గ్రామాలకు చెందిన రైతుల పంటలపై తరచూ ఏనుగులు దాడులు చేస్తుండడంతో దిక్కుతోచని స్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అటవీశాఖ అధికారులు పంటపొలాలపైకి ఏనుగులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బదిలీల శాశ్వత ఉత్తర్వులు విడుదల చేయాలి



స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల ప్రక్రియ శాశ్వత ఉత్తర్వులు విడుదల చేయాలని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరోత్తమ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును కలిసి పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కేటగిరీలో మొదట ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. సున్నా సర్వీసుతో బదిలీలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులకు 8 సంవత్సరాలు, హెచ్‌ఎంలు, ఎంఈఓలకు 5 సంవత్సరాలు అర్హతగా పేర్కొనాలని తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు టీచర్లు తప్పనిసరిగా ఉండేలా కాంప్లెక్సు పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ఏడుగురు స్కూల్ అసిస్టెంట్‌లు, ఒక హెచ్‌ఎం, ఒక పీడీ ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. టీచర్ల డిమాండ్‌లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. అనంతరం అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి



వరదరాజస్వామివారి ఆలయంలో పుష్పాలంకరణ



స్వామివారి గ్రామోత్సవం

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అనుబంధమైనా శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజ స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వంగా సుందరంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, ఉత్తర ద్వారదర్శనం కల్పించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ప్రధాన ఆలయం నుంచి స్వామి వారికి ఈఓ పెంచల కిషోర్ పట్టువస్త్ర సమర్పణ చేశారు. తర్వాత వరదరాజస్వామిని గ్రామోత్సవం నిర్వహించారు. పవళింపు కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది వాసు, బాలాజీనాయుడు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.